# ట్రిక్

## కప్పుగంతుల మల్లికార్జునరావు

'అమెరికాలో గ్రీన్‌కార్డ్ హోల్డర్ అయిన ఆంధ్ర యువకుడికి మెడిసన్ డిగ్రీ ఉన్న పాతిక సంవత్సరాల యువతి కావలెను' ఒకటికి పదిసార్లు ప్రతిభ ఆ ప్రకటనను చదివింది.

అతను కోరుకునే అన్ని అర్హతలు తనకున్నాయి. కానీ అతను అమెరికాలో స్థిరపడ్డాడు. తాను భారతదేశం వదిలి వెళ్లదు.

పేపర్ని అవతల పడేసి చేతి గడియారం చూసుకొందామె.

'అమ్మా. స్పెషలిస్టుగారు పరీక్షిస్తా నన్నారు కదా! వెళ్దాం పద.'

'ఎందుకే అమ్మా. నా మాయదారి రోగం తగ్గేనా? చచ్చేనా? మనిద్దరం తలుపులు వేసుకు పోతే వచ్చిన పేషెంట్లు వెళ్లిపోతారు. ఎందుకొచ్చిన నష్టం చెప్పు.'

భర్త కోరిక ననుసరించి, సావిత్రమ్మ గుడ్డలు కుట్టి, అప్పడాలు చేసి, విస్తర్లు కుట్టి ప్రతిభను మెడిసన్ చదివించింది.

ప్రతిభ యూనివర్శిటీ ఫస్టుగా మెడిసన్ పాసయింది.

అయినా ఆమె విజ్ఞానం తల్లికి వచ్చిన రోగాన్ని డయాగ్నయిజ్ చేయటానికి సరిపోలేదు. ఎందరికి చూపించి లాభం లేకపోయింది.

అదలా ఉండగా ఆమెకు ఉద్యోగం చిక్కలేదు. పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టి క్లినిక్‌ను ఓపెన్ చేసే శక్తి లేదు.

అద్దె ఇంట్లోనే ఒక గదిలో ప్రాక్టీస్ ఆరంభించింది.

కానీ వీధికి పదిమంది డాక్టర్లున్న ఊరు అది.

'నీ స్నేహితురాలు సుజాతను ఎవరో డాక్టరు చేసుకున్నడటగా? ఇద్దరూ కలిసి హాస్పిటల్ పెట్టారుట! నిన్నూ అలాంటి డాక్టర్ ఎవరైనా చేసుకుంటే ఎంత బాగుండేనే అమ్మా?' సావిత్రమ్మ ఆశ అది.

కానీ సుజాత ఆ పురుష పుంగవుడికి ఎంత కట్నం చెల్లించిందో. ఆ పిచ్చి తల్లికేం తెల్సు?

ఈవాళో రేపో రాలిపోయే ఆకునే తల్లీ నేను. నా ఆరోగ్యం కోసం పడే ఆరాటంలో వందోవంతు నీ పెళ్లికోసం పడ్తే ఏనాడో నీకు పెళ్లయివుండేది. నీ నెత్తిన నాలుగు అక్షింతలు వేసి పోదామని నా కోరికే అమ్మా'

స్పెషలిస్టు సావిత్రమ్మను పరీక్షించాడు.

'డాక్టర్ ప్రతిభా. యువర్ మదర్ రిక్వయిర్స్ ఎ మేజర్ ఆపరేషన్. రెండేళ్లు ఆగినా ఫర్వాలేదు. కానీ కాస్టిలీ ఆపరేషన్. ఢిల్లీ వస్తే ఆపరేషన్‌కు అవసరమైన ఏర్పాటు చేయగలను. అంటూ సావిత్రమ్మ రోగాన్ని వైద్య భాషలో వివరించి చెప్పాడు స్పెషలిస్టు.

* * *

ఆ మాయదారి రోగం ఏమిటో ఈయనన్నా కనుక్కున్నాడా? అయినా రాలిపోయే ఆకుల్ని చిగురింపజేయాలని ఎందుకే అమ్మా వృధా ప్రయాస నీకు?

తల్లి, కన్నతల్లి... రాలిపోయే ఆకు అనుకొని ఎలా పూరుకోటం? ఆపరేషన్ చేస్తే బతుకుతుంది. కానీ లక్షలు ఎలా సంపాదించటం?

పేపర్లో వివాహ ప్రకటన గుర్తుకొచ్చిందామెకు.

అతడెవరో తనని చేసుకుంటే అమెరికా వెళ్లవచ్చు. డబ్బు సంపాదించవచ్చు.

'అమ్మా. పెళ్లిచేసుకొని నేను భర్తతో అమెరికా వెళ్ళాననుకో. నువ్వు వొంటరిగా ఇక్కడ వుండగలవా?

'అంత పుణ్యం పుట్టి నీకు పెళ్లి కావాలి కాని నేనేం చేయమన్నా చేస్తానే అమ్మా. పెళ్లి చేసుకొన్న పిల్ల అత్తింటికి వెళ్లక పుట్టింట్లో ఉంటుందా?

ఎంతో ఆశగా అంది సావిత్రమ్మ.

ప్రతిభ గుండె ఆర్ద్రమయింది.

ఆ తల్లి బిడ్డకోసం ఎంత త్యాగమైనా చేయగలదు.

కానీ బిడ్డగా తను ఆ తల్లికి చేయగలిగిన సేవ ఏమిటి?

* * *

> ఇండియాలో అయితే డిగ్రీ వుంటే ఉద్యోగాలను కొనుక్కోవచ్చు. అసమర్థతను, అజ్ఞానాన్ని ఉద్యోగం చాటున కప్పిపెట్టుకోవచ్చు. అమెరికాలో డాక్టర్ ఉద్యోగం సంపాదించుకోవాలంటే 'ఇసిఎఫ్‌యమ్‌జి' పాస్ కావాలి.

శ్రీపతి రూపం బాగానే వుంది. కానీ అతని పర్సనాలిటీలో ఏదో లోపం ఉందని చూడగానే అనిపించింది ప్రతిభకు.

ఇంటర్వ్యూ అయిపోయింది.

మిస్ ప్రతిభా. మీరు నాకు అన్ని విధాలా నచ్చారు. మీలా ఆత్మవిశ్వాసం వున్నవారు అమెరికాను జయించగలరు. మీలాంటి భార్యకోసమే నేను అన్వేషిస్తున్నాను. కానీ నేను మీ అంత ప్రతిభావంతుడిని కాను అంటూ అతను తన కథను చెప్పేడు.

చిన్నప్పటి నుంచి శ్రీపతిని పాశ్చాత్య సంపర్కం వల్ల ఏర్పడ భ్రష్ట విలువలు ఆకర్షించాయి.

రౌడీ వేషాలు వేయడం, హీరోయిజంగా భావించాడు. చదవటం, పనిచేయడం, నిజాయితీగా ఉండడం చాతకాని చవటల లక్షణాలని భావించాడు.

భౌతిక సుఖం వెంట పరుగులు తీసేడు. అన్నింటికీ అడ్డు మార్గాలు తొక్కేడు.

విద్యార్థి దశలో తనకన్నా జూనియర్ విద్యార్థుల వెందరికో జూనియర్ అయ్యాడు. తిక్కరేగినపుడు మాస్టర్లను భయపెట్టో, అధికారులకు లంచాలిచ్చో క్వాలిఫికేషన్ కాగితాలు కొనుకున్నాడు. కాలేజీలో సీట్లు కొనుక్కున్నాడు.

ఫలితంగా మెడిసన్‌లో "ఏబిసిడీ"లు తెలియకపోయినా డాక్టరన్న క్వాలిఫికేషన్‌ను పేరుకు ముందు తగిలించుకో గలిగాడు.

డిగ్రీ పట్టుకొని అమెరికాకు ఎగిరిపోయాడు.

అప్పటికే అక్కడ సెటిల్ అయివున్న తన వాళ్లద్వారా గ్రీన్‌కార్డ్ హోల్డర్ కాగలిగేడు. కానీ ఉద్యోగం?

ఇండియాలో అయితే డిగ్రీ వుంటే ఉద్యోగాలను కొనుక్కోవచ్చు. అసమర్థతను, అజ్ఞానాన్ని ఉద్యోగం చాటున కప్పిపెట్టుకోవచ్చు.

కానీ అమెరికాలో డాక్టర్ ఉద్యోగం సంపాదించుకోవాలంటే 'ఇసిఎఫ్‌యమ్‌జి' పరీక్ష పాస్ కావాలి. రెసిడెన్సీలో సీట్ పొందాలి.

శ్రీపతికి సాధ్యమా?

అమెరికాలో అనుభవాలు అతనికి గుణపాఠాల్ని నేర్పేయి.

జీవితంలో ఎంతో విలువైన యవ్వన దశను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ జీవితమే నిష్ప్రయోజనవుతుంది.

అతను తను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవాలనుకున్నాడు.

అందుకే అతనిప్పుడు వివాహం చేసుకోవాలనుకుంటున్నాడు.

శ్రీపతి 'ఆనెస్టీ' ప్రతిభను ఆకర్షించింది.

తనను గురించి సర్వం చెప్పింది.

ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

* * *

శ్రీపతి చేతి గడియారం చూచుకున్నాడు.

రాత్రి పదకొండు గంటలు.

ప్రతిభ ఈపాటికి ఎప్పుడో ఇంటికి వచ్చి ఉండాల్సింది.

హాస్పిటల్‌లో ఆమె పనిచేసే డిపార్ట్‌మెంట్‌కి ఫోన్ చేశాడు.

'మా డిపార్ట్‌మెంట్లో ఆమె పని ముగించుకొని వెళ్లిపోయింది. మరో డిపార్ట్‌మెంట్ వారు అపాయింటారేమో! షి ఈజ్ ఇన్ గ్రేట్ డిమాండ్ నౌ ఎ డేస్ — యునో'' అవతలి వ్యక్తి అన్నాడు.

నీరసంగా నిట్టూర్చాడు అతను.


పెళ్లి చేసుకొన్నాడన్న మాటేగానీ ప్రతిభతో అతను గడపిన కాలం చాలా తక్కువ.

అమెరికా వచ్చిన దగ్గరినుంచి ఆమె తన లక్ష్యసాధనలో మునిగిపోయింది.

ఇసీయఫ్‌యమ్‌జీ పరీక్ష పాసయింది. అయినా రెసిడెన్సీగా సీటు రావటం సులభం కాదు. ముందు ఏదన్నా హాస్పిటల్‌లో పార్ట్‌టైమ్‌గా పని దొరుకుతుందేమోనని ప్రయత్నించింది.

చివరికి ఒక డాక్టర్ ఆమె ప్రతిభకు ఆకర్షితుడై పార్ట్‌టైమ్ వర్క్ ఇచ్చాడు.

'షి ఈజ్ ఎ బ్రిలియెంట్ గాల్. ఏన్ ఎస్సెట్ టుది ఇనిస్టిట్యూషన్' నాలుగు నెలలు ఆమెను అబ్‌జర్వ్ చేసి.. మిగతావారికి రెకమెండ్ చేసేడు.



క్రమంగా ఆ హాస్పిటల్‌లో ఆమె డిమాండ్ పెరిగింది.

ఆమె ఎలాంటి ఛాలెంజ్‌నైనా ఎదుర్కోటానికి ఎప్పుడైనా సిద్ధమే.

తన సుఖం కన్నా లక్ష్యసాధనకు ప్రాధాన్యత నిచ్చింది.

శ్రీపతి ఆమెతో సహకరించాడు.

కానీ అప్పుడప్పుడూ ఏదో కోల్పోతున్నానన్న ఫీలింగ్.

శ్రీపతికి ఆ రాత్రి నిద్ర పట్టలేదు.

తెల్లవారబోతుండగా ప్రతిభ వచ్చింది.

'సారీ డియర్' అంటూ అతని కౌగిట్లో వాలిపోయింది.

ఇద్దరూ కాసేపు సర్వస్వం మర్చిపోయారు.

'డార్లింగ్ నీకో శుభవార్త చెప్పనా?'

'ఏమిటి?' నన్ను తండ్రి చేస్తున్నావా?

అప్పుడే ఆశ! నాకు రెసిడెన్సీలో సీటు వస్తున్నది. ఈవాళ మా హెడ్ చెప్పాడు.

ఓ! అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ ప్రతీ' అంటూ శ్రీపతి ఆమెను గాఢంగా కౌగిలించుకున్నాడు.

* * *

హాస్పిటల్ నుంచి డిస్చార్జ్ అయి ఇంటికొచ్చిన రోజా పొగిడింది సావిత్రమ్మ.

నగరాన్నంతా చూచి, పదిమంది తెలుగు కుటుంబాల వారితో మాట్లాడాక ప్లేటు మార్చేసిందిప్పుడు.

'అయినా ఆడ పిల్లలు అలా తిరుగుతుంటే తల్లిదండ్రులు ఎలా చూస్తూ ఊరుకుంటారో? వచ్చిన పని అయిపోయిందిగా? ఇక నన్ను మన దేశం పంపేయి తల్లీ. నేనిక్కడ ఉండలేను'

'అలాగే నమ్మా. ఏర్పాట్లు చేస్తాలే'

'వెళ్ళేముందు నీక్కూడా వొక్క సలహా వే ప్రతిభా. డబ్బు మనిషికి అవసరమే. కాదనను. కాని జాతి, మతం, సంస్కృతి కూడా అంత అవసరమే. అవి పోగొట్టుకోకమ్మా నువ్వు. వీలవుతే నీ భర్తను వొప్పించి మన దేశానికొచ్చేయ్. ఏం?'

నవ్వుతూ తలూపింది ప్రతిభ.

• • •

ఇదేం అమెరికానే తల్లీ. ఒకటే ఉరుకులు... పరుగులు... నాకు మయసభ గుర్తుకొస్తున్నది.

తల్లిని అమెరికాకు పిలిపించి చాలా ఖరీదైన ఆపరేషన్‌ను చేయించింది.

ఓడిపోయిన రాచిప్పలాంటి నన్ను రుబ్బురోలులా మార్చారుగదుటే ఈ డాక్టర్లు! దేముళ్లంటే ఈ డాక్టర్లే నే తల్లీ. స్వర్గమంటే ఈ అమెరికాయే కాబోలు!

తల్లికోసం పెళ్ళి చేసుకొని అమెరికా వచ్చింది. తన కోసం ధనార్జన చేసింది. భర్త కోసం బిడ్డను కనబోతోంది.

కానీ తన లక్ష్యం?

బ్యాంక్ బాలన్స్ చూసుకుంది.

ఓ! ఈ డబ్బు చాలు.

ఎలాగైనా భర్తనొప్పించాలివాళ.

'ఏమండి. గుడ్‌న్యూస్. ఏమిటో చెప్పుకోండి చూద్దాం'

శ్రీపతి ఆమె శరీరంలో అన్ని అవయవాలను పరీక్షగా చూశాడు.

'లాలి పరమానంద రామ గోవిందా... జోజో... ఏం?' ఆమెను అమాంతం రెండు చేతుల్తో ఎత్తుకుని ఊపుతూ పాడసాగాడు.

ఇదే మంచి సమయం. భర్త మంచి 'మూడ్'లో వున్నాడు.

'ఏమండీ. ఈ శుభ సమయంలో మిమ్మల్ని వొక కోరిక — వోవో— వరం కోరనా!?'

అడగాలనుకొంది. కానీ అడగలేకపోయింది.

శ్రీపతి తను ఏం కోరినా ఇస్తాడు. కానీ అమెరికా వదిలి రమ్మంటే మాత్రం ఫీలవుతాడు. కోపంతో అల్లరి చెయ్యవచ్చు.

అడగరాని కోరిక కోరి తను అతని ఈగో పైన దెబ్బకొట్టడం మంచిదా?

భార్యాభర్తల్లో ఎవరు ఎక్కువ సంపాదిస్తున్నారు, ఎవరిది హెచ్చు హోదా అన్న విషయాలని అమెరికాలో అయితే ఎవరూ పట్టించుకోరు.

ఇండియాలో అలా కాదు.

భార్య ఆధిక్యతను భర్తే భరించలేడు. భార్యలు అధికులుగా ఉంటే భర్తలకి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ జబ్బు పీడిస్తుంది.

అయినా తను వరం అడగక ముందే శ్రీపతి సైలెంట్ అయిపోయాడే.

కోపమా? అలకా?

పక్కమీద అలగడం శ్రీమతికున్న అందమైన వొక సర్దా.

'కోపం వచ్చిందా?'

అతడిని ప్రసన్నం చేసుకొనే టోన్‌లో మృదువుగా అంది.

'ఉహూ. ఆలోచనలో పడ్డాను. తండ్రిని చెయ్యబోతున్న సమయంలో నేను వరాలివ్వటం కరెక్ట్. కానీ అయామ్ ఎ సెల్ఫిష్ మేన్ ప్రభా. కనుక నిన్ను నేనే వొక వరం కోరాలనుకుంటున్నాను. ముందు అది నువ్వు శాంక్షన్ చేస్తే ఆ తర్వాత నువ్వు ఎన్ని అడిగినా ఆ బ్రహ్మదేవుడిలా కళ్ళు మూసుకుని ఇస్తాను'

ఏమిటో అతని కోరిక?

'అడగండి' భయం భయంగానే అంది ప్రతిభ.

'మనం ఇండియా వెళ్ళి సెటిల్ అవుదాం. ఇక్కడ సంపాదించిన డబ్బుతో అక్కడ ప్రశాంతంగా హాయిగా...'

సర్‌ప్రైజ్! అయినా అణుచుకొని అడిగింది.

'ఇండియా వెళ్ళి సెటిల్ అవుదామనుకోటానికి మీ కారణం ఏమిటో నేను తెల్సుకోవచ్చా?'

'ష్యూర్. చలపతిరావు గారి అమ్మాయి ఆత్మహత్య చేసుకొంది. కామేశ్వరశర్మగారి కొడుక్కి అమెరికా కోడలు విడాకులిచ్చి పోయింది. సాంబమూర్తిగారి ఫేమిలీ ఎర్నింగ్స్ అంతా సైకియాట్రిస్ట్ ఫీజులకే చాలటం లేదు. ఇవన్నీ చూస్తుంటే నాకు భయమేస్తున్నది. నా బిడ్డలు 'రూట్స్' లేని అనాథలు కావడం నాకిష్టం లేదు. నాలుగు చేతులా డబ్బు సంపాదిస్తున్న నీకు అమెరికా వదిలి రావటం అంటే కష్టమని నాకు తెల్సు. కానీ మన పిల్లల కోసం నువ్వు ఆ మాత్రం త్యాగం చెయ్యాలి. దటీజ్ మై రిక్వెస్ట్. అభ్యర్థన'

'ఓకే! మీరు అడిగిన వరాన్ని ఇచ్చేసాను. నేనిక అడగాల్సిన వరం ఏమీ లేదు. ఎందుకంటే మీరడిగిన వరం, నేను అడగాలనుకొన్న వరం ఒక్కటే'

'ఈజ్ ఇట్! లాలీ' అంటూ ఆమెను కౌగిలించుకుని ముద్దుపెట్టుకున్నాడు శ్రీపతి.

'కానీ డియర్ సర్. ఇండియా వెళ్ళాలనుకోటానికి మీ కారణాన్ని మాత్రం నేను అంగీకరించను. భారతీయ ఆచార సంప్రదాయాలను, సంస్కృతీ విలువలను బిడ్డలకు చిన్నతనం నుంచి తల్లిదండ్రులు నూరిపోస్తే అమెరికాలో పెరిగినా మన బిడ్డలు భారతీయ తత్వాన్ని కోల్పోరు. మానసిక సామాజిక సంఘర్షణ తలెత్తదు. అమెరికాలో వుండే నేను దాన్ని సాధించగలనన్న విశ్వాసం నాకుంది'

'మరైతే రాణీగారు ఇండియాకి వెళ్ళాలని ఎందుకనుకున్నారో?'

'ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే మీరు నా కోరికను తీరుస్తానని మాటివ్వాలి'

'అదేంటి మళ్ళీ?'

'అదంతే మళ్ళీ'

'ఆల్‌రైట్ అడుగు'



### నాటు

"ఏహోయ్.... సాంబయ్యా— నువ్వు రోజూ కల్లు కాంపౌండుకి వెళ్లి నాటుసారా కొట్టి ఆఫీసుకొస్తున్నావటగా... నిజమేనా?" మందలించాడు ఆఫీసర్.

"అయ్యా... నిజమేనండీ... లవలేవో జీతం పెంచమంటే పెంచరు. కంపెనీ సరుకు నా తాహతుకి సరిపోదుకదండీ" తూలుతూ చెప్పాడు సాంబయ్య.

గంటి సుబ్రహ్మణ్యశర్మ
(అమలాపురం)

'నా జన్మభూమి ఋణాన్ని తీర్చుకోడానికి, నా తండ్రి కోరికను తీర్చటానికి నేను ఇండియాకి తిరిగి వెళ్ళాలనుకుంటున్నాను'

'ఓ! ఐసీ!'

'నేను డాక్టరై మా గ్రామంలో ప్రజలకు వైద్యసేవ చేయాలన్నది మా నాన్నగారి చివరి కోరిక. ఆయన సరైన వైద్యం దొరకని పరిస్థితిలో మరణించాడు. మా నాన్న కోరికను తీర్చటానికి మా అమ్మ నన్ను కష్టపడి చదివించింది. బిడ్డగా వారి ఋణాన్ని తీర్చుకోటం నా ధర్మం కాదా? అలాగే నేను మెడిసిన్ చదవటానికి మన దేశం నా మీద ఎంతో ఖర్చు చేసింది. ఎందుకు? నేను దేశానికే ఏదో సేవ చేస్తానన్న ఆశతోనే కదా? మరి నా దేశం పట్ల నా బాధ్యతను నెరవేర్చటం నా ధర్మం కాదా? కాగా ఇవాళ నాలాంటివాళ్ళ అవసరం అమెరికాలో కన్నా నా స్వదేశంలోనే వుంది.'

'కానీ నీ ప్రతిభకు మన దేశంలో గుర్తింపు లభించలేదు కదా? రేపు లభిస్తుందన్న నమ్మకం ఏమిటి?'

'లభించకపోతేనేం? నిష్కామ కర్మ చేయకూడదా? భారతీయ ఆధ్యాత్మిక చింతనాసారం అదేకదా?'

'ఇంతకీ నీ కోరిక ఏమిటి?'

'స్పీడ్ జీవితంలో థ్రిల్‌ని, డబ్బు సంపాదించటంలో గల మజాని ఇన్నాళ్ళు ఇక్కడ మనం అనుభవించాము. ప్రశాంత జీవితంలో గల పరమానందాన్ని కూడా కొంతకాలం అనుభవిద్దాం. త్యాగం, నిస్వార్థ సేవలద్వారా లభ్యమయ్యే థ్రిల్‌లో గల మాధుర్యాన్ని కూడా రుచిచూద్దాం'

శ్రీపతి ఆమెను రెండు చేతుల్లోకి తీసుకున్నాడు.

'ఆ ఆనందాను భూతుల్ని పొందాలంటే నేనూ నీతోపాటు సేవా కార్యక్రమాలలో పాల్గొనాలి కదా? మెడిసిన్‌లో నాకు రిఫ్రెషర్ కోర్సు చెప్పే బాధ్యత నీదే మరి!'

అతడి గుండెలపై వాలిపోయిందామె!

✽

